# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- భారత నూతన ఉపరాష్ట్రపతిగా సి. పి. రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు.
- వరద ప్రభావిత పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పర్యటించి పరిస్థితులను సమీక్షించారు.
- నేపాల్ లో చెలరేగిన నిరసనల కారణంగా ఆ దేశ ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి తన పదవికి రాజీనామా చేశారు.
- ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ ఉపగ్రహాలు నిరంతరాయంగా పని చేశాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి, సి.పి.రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ఈరోజు జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికలో బి.సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో ఆయన గెలుపొందారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఓటింగ్ లో మొత్తం 781 మంది పార్లమెంట్ సభ్యులకు గాను 767 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలో సి.పి.రాధాకృష్ణన్ కు అనుకూలంగా 452 ఓట్లు, బి.సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొత్తం ఓట్లలో 15 చెల్లనవిగా గుర్తించి.. 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందారని రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రమోద్ చంద్రమోదీ ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల వరదలతో నష్టపోయిన పంజాబ్ రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 1,600 కోట్ల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించారు. వరద పరిస్థితిపై పంజాబ్ లోని గురుదాస్‌పూర్ లో ఆ రాష్ట్ర సీనియర్ అధికారులతో ప్రధాని ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. వరదల కారణంగా అనాథలైన పిల్లలకు 'పిఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం' కింద సమగ్ర సహాయం

అందించనున్నామని తెలిపారు. అంతకుముందు విహంగ వీక్షణం ద్వారా హిమాచల్ ప్రదేశ్‌లో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సమీక్ష నిర్వహించి 1,500 కోట్ల రూపాయల తక్షణ సహాయాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఇరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు తోడ్పాటు అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ ఉపగ్రహాలు నిరంతరాయంగా పని చేస్తూ.. సైన్యానికి అవసరమైన సమాచారాన్ని అందించాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి. నారాయణన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (AIMA) కి చెందిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భూ పరిశీలన, కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ సేవలందించాయని పేర్కొన్నారు. స్వదేశీ సాంకేతికతను ప్రోత్సహిస్తూ.. ప్రపంచ అంతరిక్ష రంగంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ఇస్రో కృషి చేస్తోందని నారాయణన్ వివరిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ... భారత సాయుధ దళాలు స్వదేశీ రక్షణ ఉత్పత్తులు, ఎగుమతులు, ఆవిష్కరణల ద్వారా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. అదే విధంగా భద్రత, జాతీయ స్వావలంబనకు కృషి చేస్తున్నాయని తెలిపారు. శత్రుదేశాల సాంకేతిక ప్రభావాన్ని అధిగమించడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత పొరుగుదేశమైన నేపాల్ లో చెలరేగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో ఆ దేశ ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి తన పదవికి ఈరోజు రాజీనామా చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఆ దేశ ప్రభుత్వం ఇటీవలి విధించిన నిషేధంపై గత కొద్ది రోజులుగా నిరసనలు వ్యక్త మవుతున్నాయి. ఈ నిరసనలు హింసారూపం దాల్చడంతో అనేక చోట్ల ఘర్షణలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీనితో వందలాది మంది నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ.. ప్రధాని కార్యాలయంలోకి ప్రవేశించారు. ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ.. బాల్కోట్‌లోని ప్రధాన మంత్రి నివాసాన్ని ముట్టడించారు. ఈ తరుణంలో కె.పి. శర్మ ఓలి ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా నేపాల్‌లో నివసిస్తున్న భారతీయులందరూ జాగ్రత్తగా ఉండాలని, ఆ దేశంలో నిరసనలు జరుగుతుండడంతో నేపాల్ అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భావితరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలలో ఒక విప్లవాత్మక మార్పుకు సంకేతాలుగా కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొనారు. ఈ సంస్కరణలు వ్యవసాయ రంగ వృద్ధికి నూతన అధ్యాయానికి శ్రీకారం చుడతాయని చెప్పారు. అదేవిధంగా ప్రతి రంగంలోనూ సానుకూల ఫలితాలు రానున్నాయని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ.. ఈరోజు ఒక ప్రకటనలో వ్యక్తం చేశారు. GST సంస్కరణల ప్రభావం చిన్న, మధ్య తరహా రైతులపై ఉంటుందని వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తితో పని చేసే పరికరాలపై GST తగ్గించడం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గి రైతుల ఆదాయలు పెరుగుతాయన్నారు. జీవ

రసాయనాలు, పురుగుమందులు, సూక్ష్మపోషకాలపై GST తగ్గించబడం వలన రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. GST సంస్కరణలు సమగ్ర వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తాయన్నారు. టెండు ఆకులపై GST తగ్గించడం వల్ల గిరిజన వర్గాల జీవనోపాధి మెరుగవుతుందని, వాణిజ్య వస్తువుల వాహనాలపై GST తగ్గడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా చౌకగా మారుతుందని కేంద్రమంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి న్యూఢిల్లీలో రేపు జరిగే ఒక కార్యక్రమంలో అత్యాధునిక ఎలక్ట్రిక్ వెహికల్ టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఆ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షా కేంద్రం ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ తయారీదారులకు, ముఖ్యంగా తూర్పు భారతదేశంలో ఉన్నవారికి విశ్వసనీయమైన, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పరీక్ష, ధృవీకరణను అందిస్తుందని, ఉత్పత్తి భద్రత, పనితీరు, నియంత్రణ సమ్మతిని నిర్ధారిస్తుందని తెలిపింది. దీని ఏర్పాటుతో ఎలక్ట్రిక్ వాహనాల పర్యావరణ వ్యవస్థను కాపాడడమే కాకుండా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దేశీయ తయారీదారులకు సరసమైన పరీక్షా సేవలతో సాధికారత కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప-హిమాలయాలు, పశ్చిమ బెంగాల్ సహా ఈశాన్య భారతదేశంలో... రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD)పేర్కొంది. అలాగే అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, జార్ఖండ్, కేరళ, ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, తెలంగాణలలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త శశి కాంత్ మిశ్రా వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,787 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 314 పాయింట్ల లాభంతో 81,101 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95 పాయింట్ల లాభంతో 24,868 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.10గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.55 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,653 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =